క్లుప్తంగా

ఎమ్మెల్సీ అభ్యర్థి ఫ్లెక్సీ తొలగింపు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్, సైన్స్‌ఫెయిర్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ సంఘం నాయకులు ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయనున్న వంగ మహేందర్ రెడ్డి ఫొటోతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేయగా, కొన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఫ్లెక్సీని తొలగించాలని అధికారులను ఆదేశించడంతో సిబ్బంది ఫ్లెక్సీని తొలగించారు.

అవినీతి నిర్మూలనతోనే దేశాభివృద్ధి

కైలాస్‌నగర్: అవినీతి నిర్మూలనతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ దిశగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆర్డీవో వినోద్ కుమార్ అన్నారు. అవినీతి నిరోధక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏసీబీ కార్యాలయం నుంచి చేపట్టిన ర్యాలీని ఆర్డీవో ప్రారంభించారు. ప్రధాన వీధుల గుండా కలెక్టరేట్ వరకు ర్యాలీ కొనసాగింది. ఎవరైనా లంచం అడిగితే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏసీబీ సీఐ స్వామి, హెడ్ కానిస్టేబుల్ మార్కండేయ, కానిస్టేబుళ్లు దేవేందర్, స్వామి పాల్గొన్నారు.

'బీసీబంధు' అమలు చేయాలి

బోథ్: బీసీబంధు పథకాన్ని అమలు చేయాలని బీఆర్‌ఎస్ మండల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్‌కు వినతిపత్రం అందజేశారు. బీసీలకు రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ ద్యాగాల నారాయణ, మాజీ ఆత్మ చైర్మన్ మల్లె పూల సుభాష్, భీమ భుచ్చన్న, ఓరుగంటి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నేరడిగొండ: సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కుమారి జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి, ఆశ కార్యకర్త పుష్పల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్యాపకులు కంకణబద్ధులై పని చేయాలి

నార్నూర్: అధ్యాపకులు కంకణబద్ధులై పని చేయాలని డీఐఈవో రవీందర్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధ్యాపకుల హాజరు పట్టికతో పాటు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో వందశాతం ఫలితాల సాధన కోసం అధ్యాపకులు ప్రణాళికబద్ధంగా విద్యాబోధన చేయాలన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్ కోసం బాటలు వేయాలన్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ వెంకట కేశవులు, అధ్యాపకులు కాంబ్లే బాలాజీ, వెంకట రమణ, నరేశ్, ఉదయ్‌కుమార్, లింగంపల్లి సుజాత పాల్గొన్నారు.

కళాశాల ఏర్పాటు చేయాలి

ఇచ్చోడ: మారుమూల గిరిజన ప్రాంతమైన ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో గిరిజన విద్యార్థుల కోసం జేఎన్‌టీయూ కళాశాలను ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లుబట్టి విక్రమార్కను హైదరాబాద్‌లోని బంజార సంఘం రాష్ట్ర చైర్మన్ నరేందర్ నాయక్, విద్యార్థి సంఘం నాయకుల వినోద్ కోరారు. ఈసందర్భంగా శుక్రవారం వినతిప్రతం అందచేశారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మెస్ ఫీజులు ప్రభుత్వం చెల్లించే విధంగా నూతన జీవోను ఇవ్వాలని, పోటీ పరీక్షల కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల కోసం అన్ని క్యాంపస్‌లో ఉచిత కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు.

బంద్ విజయవంతం చేయండి

ఎదులాపురం: తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ పిలుపు మేరకు శనివారం జిల్లా వ్యాప్తంగా ఆటోలు, ట్యాక్సీలు, క్యాబ్‌ల బంద్ విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఠాకూర్ హోటల్ వద్ద బంద్‌కు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు జగన్‌సింగ్, నగేశ్, దళిత్, షకీల్, ఫసి, భూమన్న, రాకేశ్, సుకుమార్ పాల్గొన్నారు.


నేరడిగొండ: నివాళులర్పిస్తున్న సంఘం సభ్యులు


తలమడుగు: అంబేడ్కర్ వర్ధంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్


తలమడుగు: నినాదాలు చేస్తున్న నాయకులు

అంబేడ్కర్‌కు ఘన నివాళి

జిల్లా వ్యాప్తంగా రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. అధికారులు, ఆయా సంఘాల నాయకులు అంబేడ్కర్ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ నివాళులర్పించారు. తాంసి బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి అసిస్టెంట్ కలెక్టర్ అభిజ్ఞాన్ పూలమాల వేశారు. ఆయన ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. – సాక్షి, నెట్‌వర్క్


ఉట్నూర్‌రూరల్: పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


నార్నూర్: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గ్రామ పెద్దలు, నాయకులు


బోథ్: పొచ్చెరలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు


తాంసి: నివాళులర్పిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా


ఆదిలాబాద్‌రూరల్: నినాదాలు చేస్తున్న నాయకులు


గుడిహత్నూర్: నివాళులర్పిస్తున్న నాయకులు


బోథ్‌లో..


ఇంద్రవెల్లి: మాట్లాడుతున్న భంతేజీ పూర్ణ


ఆదిలాబాద్‌టౌన్: నివాళులర్పిస్తున్న జోగు రామన్న

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

బోథ్: బోథ్ మండలంలోని ధన్నూర్(బి) గ్రామంలోని మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బోథ్ మండల విద్యాధికారి కుమ్మరి పోశెట్టి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. ప్రతిరోజూ ఏర్పాటు చేస్తున్న సూక్తులు, నేటి ప్రశ్న, పాఠశాల దృక్పథం, విద్యార్థుల విజయానికి సోపానాలకు సంబంధించిన బోర్డులను చూసి అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రావుల శంకర్, ఉపాధ్యాయులు సవిత, స్వప్న, ప్రశాంత్, బోనగిరి సారిక పాల్గొన్నారు.

'పార్టీని మరింత బలోపేతం చేయాలి'


పోతారెడ్డిని సన్మానిస్తున్న ఆడే గజేందర్

తాంసి: నూతనంగా ఎన్నికైన యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, నాయకులు గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ సూచించారు. శుక్రవారం భీంపూర్ మండలంలోని నిపాని గ్రామంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన బద్దం పోతారెడ్డి, మండల అధ్యక్షుడిగా ఎన్నికైన ముష్రఫ్ అహ్మద్‌లను శాలువాతో సన్మానించారు. వారి వెంట మండల కన్వీనర్ సంతోశ్, రామన్న యాదవ్, వెంకట్ రెడ్డి, అశోక్, నారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

నేరడిగొండ: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని దంతతండా గ్రామానికి రూ.5 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో (రెడ్ గ్రావెల్) రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రతీ గ్రామానికి రోడ్డు వేసే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

● బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ: చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని వెంకటపూర్ గ్రామంలో పాఠశాల మరమ్మతులు, నూతన అదనపు తరగతి గదిని రూ.17.70 లక్షలతో నిర్మించగా.. శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వడ్డెర సంఘ అభివృద్ధికి కృషి

తలమడుగు: వడ్డెర సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని సుంకిడి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వడ్డే ఓబన్న విగ్రహాన్ని వడ్డెర జాతి రాష్ట్ర అధ్యక్షుడు ఏత్తరి అంతయ్యతో కలిసి ప్రారంభించారు. వడ్డెరులు అనేక మంది అభివృద్ధికి దూరంగా ఉన్నారని, వారికి ఇల్లు కూడా లేని పరిస్థితి ఉందన్నారు. వారి హక్కుల కోసం, అభివృద్ధి కోసం అసెంబ్లీలో ప్రస్తావిస్తానన్నారు. కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్, మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, నాయకులు మొట్టె కిరణ్ కుమార్, వెంకటేశ్, శ్రీనివాసరెడ్డి, మహేందర్ యాదవ్, ఆశన్న యాదవ్, రాజమల్లు, వెంకటి, బూరన్న, నర్సయ్య, భీమన్న పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

థాంక్యూ ఎమ్మెల్యే సార్...

బోథ్: బోథ్ మండలంలోని నాగాపూర్ గ్రామానికి రోడ్డు, గ్రామ పంచాయతీ భవనం మంజూరు చేయించినందుకు శుక్రవారం గ్రామస్తులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మండల కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. నాయకులు శ్రీధర్ రెడ్డి, స్వామి, కోవ మంకు, ప్రభాకర్, మడావి భీంరావు, బలరాం, హేమాజీ, జ్యోతిరాం, నాగోరావ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అయ్యప్ప స్వాములు

బోథ్ మండల కేంద్రానికి చెందిన అయ్యప్ప స్వాములు శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. నేరడిగొండ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి ఆయనను కలిసి సన్మానించారు. శనివారం జరిగే భిక్ష కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: మార్కెట్‌యార్డులోని రైతులకు ఇబ్బంది కలిగించొద్దని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి, సోయా కొనుగోళ్లను పరిశీలించారు. పలువురు రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తేమ, పంట విక్రయానికి సంబంధించి యజమాని రావాలనే నిబంధనను తొలగించాలన్నారు. ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతులు ఇబ్బంది పడకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సోయా కొనుగోళ్లపై రాష్ట్ర ప్రభుత్వం అలాట్మెంట్ ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు.


మార్కెట్‌యార్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మార్పీఎస్ ఉద్యమంతోనే ఎస్సీ వర్గీకరణ

ఇచ్చోడ: ఎమ్మార్పీఎస్ ఉద్యమం ద్వారానే ఎస్సీ వర్గీకరణ సాధ్యం కానుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేశ్ అన్నారు. శుక్రవారం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్గీకరణకు ఎవరూ అడ్డు వచ్చిన న్యాయ పోరాటం ఆగదన్నారు. ఎమ్మార్పీస్ విజయాన్ని జీర్ణించుకోలేని మాలలు సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు దుబ్బాక సుభాష్, సిరిసిల్ల భూమయ్య, టేకుల రాజు, జన్నారపు సాయి తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదివాసీలు సభకు తరలిరావాలి

నార్నూర్: ఈనెల 9న ఇంద్రవెల్లి మండల కేంద్రంలో నిర్వహించే ఆదివాసీ హక్కుల పోరాట అస్తిత్వ సభకు ఆదివాసీలు భారీగా తరలి రావాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు పిలుపునిచ్చారు. శుక్రవారం గాదిగూడ మండల కేంద్రంలోని కుమురం భీం చౌక్ వద్ద మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కొవడంతో పాటు, చట్టాల పరిరక్షణ కోసం పోరాడాల్సి అవసరం ఉందన్నారు. సమావేశంలో తుడుందెబ్బ మండల అధ్యక్షుడు మాడవి చంద్రహరి, పెందురు సంతోష్, మధు, కనక ప్రభాకర్, మెస్రం గోవింద్, జంగు శ్యామ్ రావు పాల్గొన్నారు.

సభ స్థలం పరిశీలన

ఇంద్రవెల్లి: ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఈనెల 9న ఇంద్రవెల్లిలో నిర్వహించే ఆదివాసీ హక్కుల పోరాట దినోత్సవం సభ స్థలాన్ని ఆదివాసీ నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచి 9 తెగల ఆదివాసీ సంఘాల నాయకులతో పాటు ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గోడం గణేష్, ఆర్క ఖమ్ము, మెస్రం వెంకట్‌రావ్, కొట్నాక్ బా రిక్‌రావ్, కొరెంగా సుంకట్‌రావ్, చిత్రు, భారత్ పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న నాయకులు

కొలంగూడలో వైద్య శిబిరం

ఇచ్చోడ: మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన కొలంగూడలో శుక్రవారం నర్సాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హిమబిందు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. సికిల్‌సెల్, లెప్రసీ, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాథోడ్ కృష్ణ, రేణుక, సంగీత, తిరుమల, ఆశ కార్యకర్త సరోజ పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన

తాంసి: మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట అంబేద్కర్ యువజన సంఘం నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ వర్ధంతి వేడుకలకు రావాలని ఎంపీడీవోను కోరారు. సమయం లేనందున వర్ధంతి వేడుకలకు హాజరు కాలేనని ఎంపీడీవో మోహన్‌రెడ్డి సభ్యులకు తెలిపారు. దీంతో అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. దీంతో ఎంపీడీవో మోహన్ రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు వెంటనే ఆందోళన విరమించారు.


నిరసన తెలుపుతున్న నాయకులు

'ఓపెన్ స్కూల్' సద్వినియోగం చేసుకోవాలి

ఇచ్చోడ: చదువు మధ్యలో మానేసిన విద్యార్థులు ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ అశోక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్‌ను సందర్శించి పోస్టర్ ఆవిష్కరించారు. 15 సంవత్సరాలు పైబడిన విద్యార్థులు ఇచ్చోడ అధ్యయన కేంద్రం ద్వారా విద్యను అభ్యసించాలని కోరారు. పదో తరగతి పాసైన వారు ఇంటర్ అడ్మిషన్లు పొందవచ్చన్నారు. ఈనెల 11 వరకు చివరి అవకాశం ఉందన్నారు. ప్రధానోపాధ్యాయులు, కోఆర్డినేటర్ సురేశ్ జోషి, అసిస్టెంట్ కోఆర్డినేటర్ రాథోడ్ సంతోష్, గుడిహత్నూర్ మండల విద్యాధికారి ఉదయ్‌రావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


ఇన్‌స్పైర్ మేళాలో రెడీమేడ్ ప్రదర్శనలు


ప్రదర్శనలో ట్యాబ్లెట్లు, డబ్బాలు


ప్రదర్శనలో కారు బొమ్మ

'ఇన్‌స్పైర్' కాలేదు..

● అంతా రెడీమేడ్ ప్రదర్శనలే

కేంద్ర ప్రభుత్వం ఇన్‌స్పైర్ మానక్ మేళాను ఏటా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఎంపికైన విద్యార్థి అకౌంట్‌లో రూ.10వేల చొప్పున జమ చేస్తోంది. రూ.5వేలను ప్రదర్శన తయారీ కోసం, మరో రూ.5వేలను రవాణా చార్జీల కోసం వెచ్చించాల్సి ఉంటుంది. అయితే ఈ డబ్బులను కొంత మంది విద్యార్థుల తల్లిదండ్రులు వినియోగించుకోగా, మరికొంత మంది ఉపాధ్యాయులు వినియోగించుకున్నారనే విమర్శలున్నాయి. శుక్రవారం జిల్లా కేంద్రంలోని నిర్వహించిన మేళాలో విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలు కనిపించకపోగా, కొన్ని రెడీమేడ్‌వి దర్శనమివ్వడం గమనార్హం. – ఆదిలాబాద్‌టౌన్



ఆర్టీసీ ఉద్యోగుల వనభోజనం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో శుక్రవారం వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఆదిలాబాద్ రీజనల్ మేనేజర్ సోలోమాన్, ఉట్నూర్ డిపో మేనేజర్ కల్పన, ఎస్‌టీఐ శకుంతల, ఎంఎఫ్ శ్రీకర్ హాజరయ్యారు. కార్యక్రమంలో డిపో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి పలు సాంస్కృతిక క్యాక్రమాలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిపో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీబీ నిర్మూలనకు సహకరించాలి

నేరడిగొండ: టీబీ నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలని నేరడిగొండ వైద్యాధికారి సద్దాం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టాలని పేర్కొన్నారు. సమావేశంలో హెచ్‌ఈవో పవార్ రవీందర్, సంతోష్, హెల్త్ సూపర్‌వైజర్ స్వర్ణలత, టీబీ సూపర్‌వైజర్ వెంకటేశ్, సుధ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైద్యాధికారి సద్దాం